క్లుప్తంగా

నేడు దేవరపల్లికి కంచి పీఠాధిపతి

దేవరపల్లి: కంచి కామకోటి మూలామ్నాయ సర్వజ్ఞ పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ శనివారం సాయంత్రం దేవరపల్లి వస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 20 వరకూ స్వామీజీ శ్రీవారి ఆలయం వద్ద త్రికాళార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు. 19, 20 తేదీల్లో మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారిరి పీఠంలో అభిషేకం, త్రికాళార్చన, విశేష పూజలు పీఠాధిపతులు విజయేంద్రసరస్వతి నిర్వహిస్తారని శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజుల స్వామి వారికి ఆలయం వద్ద బస ఏర్పాట్లు చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు కార్యక్రమాలకు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

నేడు మెగా లోక్ అదాలత్

నిడదవోలు రూరల్: నిడదవోలు కోర్టు ఆవరణలో ఈనెల 18న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని నిడదవోలు అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్ కోరారు. మెగా లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయవాదులు, పోలీస్ సిబ్బందితో శుక్రవారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ వివాదాలతో పాలు పలు కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవాలన్నారు.

20, 21 తేదీల్లో ఆధార్ శిబిరాలు

పెరవలి: మండలంలోని మూడు గ్రామాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ కోరారు. కాకరపర్రు, అన్నవరప్పాడు, పెరవలి గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాల్లో ఆధార్ నంబర్ అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. అలాగే కొత్త ఆధార్ కార్డు పొందవచ్చని, ఆధార్ కార్డులో సవరణలు చేయించుకోవచ్చని ఎంపీడీఓ సూచించారు.

ఈ- పంట నమోదుతో పథకాల అమలు

నిడదవోలు రూరల్: ప్రతి రైతూ తప్పకుండా ఈ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.సత్యనారాయణ సూచించారు. నిడదవోలు మండలం కాటకోటేశ్వరం, కంసాలిపాలెం గ్రామాల్లో ఈ క్రాప్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏప్రిల్ 1వ తేదీ లోపే ఆర్‌బీకే పరిధిలో రబీ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోనె సంచుల కొరత లేకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

జగదీష్‌కు ఎమ్మెల్యే పరామర్శ

దేవరపల్లి: చిన్నాయగూడెం సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్‌ను శుక్రవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో జగదీష్ కాలికి గాయమైంది. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జగదీష్‌ను ఎమ్మెల్యే వెంకట్రావుతో పాటు ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, ఆయిల్ పామ్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు పరామర్శించారు.

రంగవల్లుల పోటీలు

కొవ్వూరు: ఉగాది సంబరాల్లో భాగంగా మన సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు శుక్రవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 87 మంది విద్యార్థినులు పాల్గొన్నారని ఆ సంఘం కార్యదర్శి వై.మార్కండేయులు తెలిపారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, సంస్కృత పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసమూర్తి, మద్దుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

100 శాతం హాజరు ఉండాలి

చాగల్లు: గ్రామ సచివాలయ సిబ్బందికి 100 శాతం హాజరు ఉండాలని ఎంపీడీవో బి.రామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని పలు సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అనవసరంగా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. ఆయుష్మాన్ భారత్ సర్వే వంటి సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించాలని, కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వలంటీర్లు కూడా తప్పనిసరిగా బయో మెట్రిక్ హాజరు వేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బాపినీడు జయంతి

కొవ్వూరు: ప్రముఖ రాజకీయ వేత్త, విద్యాదాత అల్లూరి బాపినీడు జయంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని బాపినీడు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.అవంతీ ఫీడ్స్ యాజమాన్యం, ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ సుబ్బారావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, అవంతీఫీడ్స్ ప్రతినిధులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. యనాద కాలనీలో అల్లూరి బాపినీడు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

గడువులోగా పన్ను చెల్లిస్తే వడ్డీ ఊరట



కొవ్వూరు పురపాలక సంఘ కార్యాలయం

- ఇళ్లు, ఖాళీ స్థలాల పన్నులపై మినహాయింపు
- చెల్లింపునకు నెలాఖరు వరకూ రాష్ట్ర ప్రభుత్వం అవకాశం
- రెండు మునిసిపాలిటీల్లో రూ.1.27 కోట్ల వడ్డీ రాయితీ

కొవ్వూరు: పురపాలక సంఘాల పరిధిలోని పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించింది. సకాలంలో ఆస్తి (ఇంటి), ఖాళీ స్థలాల పన్నులు చెల్లించని వారి నుంచి రెండు శాతం వడ్డీని వసూలు చేస్తారు. అయితే ఈ నెల 31వ తేదీ లోగా మునిసిపాలిటీకి పాత, ప్రస్తుత బకాయిలు కలిపి చెల్లించిన వారిపై వడ్డీ భారాన్ని ఎత్తివేస్తూ జీవో నంబర్ 34ను ప్రభుత్వం జారీ చేసింది. దీనివల్ల కొవ్వూరు, నిడదవోలు పురపాలక సంఘాలు రూ.1,26,86,830 మేర ఆదాయాన్ని కోల్పోతాయి. అయితే ప్రజలపై భారాన్ని తగ్గించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వడ్డీ భారాన్ని తగ్గిసూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. పన్నుల వసూళ్లలో గత ఆర్థిక సంవత్సరం కొవ్వూరు పురపాలక సంఘం రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఈ ఏడాది ప్రస్తుతానికి 26వ స్థానంలో ఉంది. నిడదవోలు పురపాలక సంఘం 89వ స్థానంలో ఉంది. ఈ నెలాఖరు నాటికి పన్ను చెల్లింపుదారులు చెల్లించే మొత్తాలపైనే పురపాలక సంఘాల ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుంది. అంతేగాకుండా ఆయా మునిసిపాలిటీల్లో రెవెన్యూ విభాగం పనితీరు సైతం ర్యాంకింగ్ మెరుగు పరుచుకోవడానికి దోహద పడుతుంది.

నిడదవోలు వాసులకు రూ.77.32 లక్షల వడ్డీ రాయితీ

నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 9,414 మంది పన్ను చెల్లింపుదారులు (అసెస్‌మెంట్లు) ఉన్నారు. ఈ మునిసిపాలిటీలో ఆస్తిపన్ను పాత బకాయిలతో కలిపి రూ.4.39 కోట్లు ఉంది. దీనిలో ఇంతవరకూ రూ.2.51 కోట్లు వసూలైంది. ఇప్పటికీ రూ.1.87 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఖాళీ స్థలాల పన్ను రూ.2.07 కోట్లు ఉంటే, అందులో రూ.49.56 లక్షలు వసూలైంది. మరో రూ.1.58 కోట్లమేర బకాయిలు వసూలు కావాలి. మొత్తం రూ.3.45 కోట్ల మేరకు పన్నుల రూపంలో వసూలుకావాలి. ఈ సొమ్ము మొత్తాన్ని గడువులోగా పన్ను చెల్లింపుదారులు చెల్లిస్తే, రెండు శాతం వడ్డీ రాయితీ ద్వారా వారికి రూ.77.32 లక్షల మేర లబ్ధి చేకూరుతుంది.

కొవ్వూరు వాసులకు రూ.49.54 లక్షలు..

కొవ్వూరు పట్టణంలో 12,467 పన్ను చెల్లింపుదారులు (అసెస్‌మెంట్లు) ఉన్నాయి. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల పాత బకాయిలతో కలిపి మొత్తం రూ.3.40 కోట్లు వసూలు కావాలి. ఇందులో ఆస్తి పన్ను రూ.1,28,39,469, ఖాళీ స్థలాల పన్ను రూ.47.48 లక్షలు. ఈ సొమ్ము మొత్తం ఈ నెలాఖరులోగా చెల్లించే పన్ను చెల్లింపుదారులపై రూ.49.54 లక్షల భారం తగ్గుతుంది. ఇప్పటికే పురపాలక సంఘ రెవెన్యూ విభాగం సిబ్బంది పన్నుల వసూళ్లను వేగవంతం చేశారు. మరోపక్క వడ్డీ రాయితీపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం



ప్రజలపై ఆర్థిక భారం లేకుండా పన్నులపై వడ్డీ రాయితీ కల్పించడం హర్షణీయం. పట్టణ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలి. ఈ నెలాఖరులోపు పురపాలక సంఘానికి బకాయిపడిన పన్నులను పూర్తిగా చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఏమైనా సందేహాలు ఉంటే పురపాలక సంఘ కార్యాలయంలో సంప్రదించాలి.

– భావన రత్నకుమారి, మునిసిపల్ చైర్‌పర్సన్, కొవ్వూరు

మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంటాం



పన్నుల వసూళ్లలో గత ఆర్థిక సంవత్సరంలో పొందిన మొదటి స్థానాన్ని నిలబెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైక్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. వార్డు సచివాలయాలు, మునిసిపల్ కార్యాలయంలో గానీ, పురసేవా యాప్ ద్వారా గానీ, సీడీఎంఎ.ఏపీ.జీవోవిటీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా గానీ ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించవచ్చు.సిబ్బందికి, సచివాలయ సిబ్బంది పన్నుల వసూళ్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం.

– బి.శ్రీకాంత్, మునిసిపల్ కమిషనర్, కొవ్వూరు

ఎలా రాస్తున్నారు? ఏర్పాట్లు బాగున్నాయా?

- ఇంటర్ విద్యార్థులను ప్రశ్నించిన కలెక్టర్ మాధవీలత
- వేగేశ్వరపురంలో పరీక్ష కేంద్రం సందర్శన
- ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం పరిశీలన



వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

తాళ్లపూడి: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలోని 47 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. మండలంలో శుక్రవారం కలెక్టర్ మాధవీలత ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. పరీక్ష ఎలా రాస్తున్నారు? ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రక్కిలంక సచివాలయాన్ని ఆమె సందర్శించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఈ సచివాలయంలో లబ్ధి పొందిన వారి వివరాలు పరిశీలించారు. అనంతరం ఇక్కడే నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులను, సిబ్బందిని వివరాలు అడిగారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని శిబిరానికి వచ్చిన గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో 47 పరీక్షా కేంద్రాల్లో 37,288 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాస్తున్నారన్నారు. మండలంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు వీలుగా బోర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. జగనన్న లేవుట్లలో స్థలం పొందిన వారు హక్కుదారులు కాకుండా వేరొకరు నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కింద జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో వైద్య సేవలు అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో ఎస్. మల్లిబాబు, తహసీల్దార్ టి.రాధిక, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వరలక్ష్మి, వైద్యాధికారులు రమణనాయక్, మైఖేల్ తదితరులు ఉన్నారు.

246 మంది విద్యార్థుల గైర్హాజరు

కొవ్వూరు: డివిజన్ వ్యాప్తంగా ఉన్న 16 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ఇంగ్లిషు పరీక్షకు 246 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 51,86 మంది విద్యార్థుల్లో 4,940 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 4,280 మందికి 129 మంది, ఒకేషనల్ విభాగంలో 906 మందికి 117 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కొవ్వూరు పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 19 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 273 మందికి 266 మంది, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 210 మందికి 203 మంది హాజరయ్యారు. రెండు చోట్లా ఏడుగురు చొప్పున గైర్హాజరయ్యారు. శ్రీ చైతన్య కళాశాలలో 240 మందికి ఐదుగురు గైర్హాజరు కాగా 235 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

సోమేశ్వరుని కల్యాణం చూతము రారండీ..



కొవ్వూరు పాతూరులో ఉమాచోడేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం

నిడదవోలు రూరల్: నిడదవోలులోని సోమేశ్వర శివ పంచాయతన క్షేత్రంలో కొలువైన బాలాత్రిపుర సుందరీ సహిత సోమేశ్వరస్వామి దివ్య కల్యాణాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించారు. కాగా శనివారం రుద్రాభిషేకాలు, గ్రామోత్సవం, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తారు. అలాగే 21న త్రిశూలస్నానం, వసంతోత్సవం, పుష్పయాగోత్సవ పవళింపు సేవతో కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో తోమాల శివ తెలిపారు.

కొవ్వూరు: పాతూరులోని ఉమా చోడేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఉదయం మహాగణపతి పూజ, త్రిశూల పూజ, రుద్ర ,లక్ష్మీగణపతి హోమాలు నిర్వహించారు. అర్చకులు కొతవరపు భాను, దేవర కొండ సాయిలు పూజలను పర్యవేక్షించారు.ఉగాది సందర్భంగా ఈనెల 22న ఉమాచోడేశ్వరస్వామి రథోత్సవాన్ని నిర్వహిహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.బాలకృష్ణ తెలిపారు.

బొట్టు పెట్టి చెబుతున్నాం.. ఆసరా అందిస్తాం

ఈనెల 25న లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ము జమ



డ్వాక్రా మహిళకు బొట్టుపెట్టి ఆసరా సొమ్ము వివరాలు చెబుతున్న ఐకేపీ సీసీ

నల్లజర్ల: మూడో విడత ఆసరా సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25న లబ్ధిదారులకు అందించనుంది. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ప్రారంభమైంది. సాయం అందించే క్రమంలో సీసీలు, గ్రామసంఘ ప్రతినిధులు ప్రతి లబ్ధిదారుని ఇంటికీ వెళ్లి, బొట్టుపెట్టి చేకూరే లబ్ధి గురించి వివరించే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు.

1621 సంఘాల్లో 16,260 మంది సభ్యులు

నల్లజర్ల మండలంలోని 1621 డ్వాక్రా సంఘాల్లో 16,260 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఆయన అధికారం చేపట్టాక రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతలుగా ఆసరా సాయాన్ని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసింది. ఈ సంఘాల మొత్తం బకాయి రూ.61.77.కోట్లు. కాగా మూడోవిడతగా రూ.15.37 కోట్లు సభ్యుల ఖాతాల్లో ఈనెల 25న జమ చేయనున్నట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు బొట్టుపెట్టి తెలియజేస్తున్నట్టు తెలిపారు.

‘రామరాజ్యం’ పాలకుల ప్రమాణ స్వీకారం

నల్లజర్ల: రామరాజ్యం ధార్మిక సంస్థ మండల పాలకులుగా కొత్తపల్లి సుబ్బారావు (ద్వారకాతిరుమల), ఆచంట రాంబాబు (దేవరపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే గ్రామ పాలకులుగా మేణ్ణి వేణు (నల్లజర్ల), బదిరెడ్డి నాగేశ్వరరావు (ఆవపాడు), మైనం వెంకట బ్రహ్మయ్య (జగన్నాథపురం), ఐనంపూడి రత్నాజీ (ముసుళ్ళగుంట), చింతా శ్రీను (తెలికిచెర్ల), ఉన్నమట్ల శ్రీను (గుండేపల్లి), కలగర భానుచంద్రశేఖర్ (ప్రకాశరావుపాలెం), బేతిన రాంబాబు (కవులూరు), జెట్టి రామకృష్ణ (మారెళ్ళమూడి) ప్రమాణ స్వీకారం చేశారు. నల్లజర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రామరాజ్య ధార్మిక సంస్థ నియోజకవర్గ స్థాపకుడు మామిడి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, యలమాటి శ్రీను, నిమ్మలపూడి ప్రసాద్, బొమ్మిరెడ్డి గాంధీ, గుంటుముక్కల రామకృష్ణ, గుదే వెంకట సుబ్బారావు, కొయ్యలమూడి ప్రసాద్ పాల్గొన్నారు. వీరందరూ గ్రామాల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

వీఆర్వోపై వచ్చిన ఆరోపణలపై విచారణ

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేట వీఆర్వో ఈ.ప్రభాకరరావుపై వచ్చిన అభియోగాలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిడదవోలు తహసీల్దార్ ఎం.గంగరాజు శెట్టిపేట పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం విచారణ జరిపారు. రెవెన్యూ సేవలకు సొమ్ములు డిమాండ్ చేస్తున్నారంటూ రైతు బూరుగుపల్లి దుర్గాప్రసాద్‌తో పాటు మరికొందరు రైతులు స్పందన కార్యక్రమంలో వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలోనూ రెవెన్యూ సేవలైన మ్యుటేషన్, అడంగళ్‌లో కరెక్షన్లు, రుణాల సర్టిపై దరఖాస్తులకు ప్రభాకరరావు సొమ్ములు డిమాండ్ చేశాడని పలువురు రైతులు తహసీల్దార్ వద్ద చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ గంగరాజు తెలిపారు.

52 లక్షల ఉపాధి పనిదినాల పూర్తి


- డ్వామా పీడీ శంకర్ రాంగోపాల్
- గౌరీపట్నంలో పనుల పరిశీలన



గౌరీపట్నంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శంకర్ రాంగోపాల్

దేవరపల్లి: ఈ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకూ 52.50 లక్షల పనిదినాలను పూర్తి చేసినట్టు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ రాంగోపాల్ తెలిపారు. మండలంలోని గౌరీపట్నంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 59 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 52.50 లక్షల పనిదినాలను పూర్తి చేశామన్నారు. ఈ నెలాఖరుకు నూరు శాతం పని దినాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది అదనంగా 10 లక్షల పనిదినాలు చేసినట్టు చెప్పారు. అజాదీ అమృత్ సరోవర్ పథకంలో భాగంగా జిల్లాలోని 75 చెరువుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఒక్కొక్క చెరువుకు రూ.2 లక్షల చొప్పున నిధులు మంజూరు కాగా, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. దేవరపల్లిలో నాలుగు చెరువులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఈ నిధుల సరిపోనందున పంచాయతీ నిధులను కేటాయించనున్నట్టు శంకర్ రాంగోపాల్ చెప్పారు. ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.ఉమామహేశ్వరశర్మ, ఉపాధి హామీ పథకం జేఈ సీహెచ్ రమాదేవి పాల్గొన్నారు.

అకాల వర్షంతో ఇటుక పరిశ్రమ కుదేలు



తడిసి ముద్దయిన పచ్చి ఇటుకలు

పెరవలి: అకాల వర్షం ఇటుక తయారీదారులను నిలువునా ముంచేసింది. ముమ్మరంగా ఇటుక తయారీ జరుగుతున్నపుడు ఊహించని విధంగా వర్షం కురవడంతో పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో పాటు ఇప్పటి వరకూ తయారైన పచ్చి ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. గురువారం ఆకాశం మేఘావృతమై సాయంత్రం చినుకులు పడ్డాయి. మార్చి నెల కదా వర్షం రాదులే అన్న ధీమాతో ఇటుక బట్టీల నిర్వాహకులు పెద్దగా పట్టించుకోలేదు. హఠాత్తుగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిలేకుండా వర్షం కురవటంతో కళ్లంలో ఉన్న పచ్చి ఇటుకలు తడిచి పోయాయి. దీంతో తయారీదారులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. నిడదవోలు నియోజకవర్గంలో ఇటుక బట్టీలపై ఆధారపడి 500 కుటుంబాలు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. సుమారు 15 వేల మంది ఈ పరిశ్రమలపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. పెరవలి మండలంలో 86 బట్టీలు ఉండగా రోజూ వాటి నుంచి 10 లక్షల ఇటుకలు తీస్తుంటారు. ప్రస్తుతం కళ్లాల్లో గురువారం సాయంత్రానికి 10 లక్షల వరకూ కొత్త ఇటుకలను తీశారు. అంతక్రితం కళ్లాల్లో మరో 10 లక్షల ఇటుక సిద్ధంగా ఉంది. ఇవన్నీ కూడా తడిచి ముద్దవడంతో ఈ ఇటుక బట్టీల యజమానులు గగ్గోలు పెడుతున్నారు. లక్షలాది రూపాయలు అప్పులు చేసి ఈ పరిశ్రమను కొనసాగిస్తుంటే ప్రకృతి కన్నెర్రతో నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

150 కిలోలకు మించిన బేళ్లు నో సేల్

దేవరపల్లి: ప్రస్తుత సీజన్‌లో రైతులు పండించిన ఎస్ఎల్ఎస్ పొగాకు కొనుగోళ్లను ఈ నెల 23 నుంచి ప్రారంభిస్తున్నందున రైతులు సహకరించాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ కోరారు. పొగాకు వేలం నిర్వహణపై స్థానిక వేలం కేంద్రం వద్ద శుక్రవారం రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్ఎం ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది వేలం కేంద్రాల వద్ద పొగాకు బేళ్ల కాటా విధానంలో మార్పులు చేశామన్నారు. కొత్త వేయింగ్ యంత్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రైతులు పొగాకు బేళ్లను 150 కిలోలకు మించకుండా తయారు చేసుకుని వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు.అంతకు మించి బరువున్న బేళ్లను నో సేల్‌గా పరిగణిస్తామన్నారు. రైతులు తమ ఇళ్ల వద్ద గ్రేడుల వారీగా బేళ్లు తయారు చేసుకోవాలని తెలిపారు. వేలం కేంద్రంలో కొనుగోలు చేయని బేళ్లను ఏరోజుకారోజు రైతులు ఇంటికి తీసుకు వెళ్లాలని రైతులు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ గ్రేడింగ్ అధికారి శివకుమార్, రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

చెదురుమదురుగా జల్లులు

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో కొవ్వూరు డివిజన్‌లోని పలు మండలాల్లో శుక్రవారం చెదురుమదురుగా జల్లులు పడ్డాయి. ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణం ఒక్కసారి మార్పు చోటు చేసుకుంది. రానున్న రెండు రోజులు కూడా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచిస్తోంది. కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి, చాగల్లు మండలాల్లో చెదురుమదురుగా జల్లులు పడ్డాయి. పెరవలి మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. శని, ఆదివారాలు కూడా వర్ష సూచన జారీ చేయడంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరిపంట పాలు పోసుకునే దశలో ఉంది.ఈ తరుణంలో వర్షం కురిస్తే గింజ తయారీకి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.